సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం ; 3 ; మే ; 2024



ఉపమాక వెంకన్న సన్నిధి మరో కోనసీమగా ఖ్యాతి 10లో



రచ్చబండ
మేం నమ్ముతాం నిన్నే జగన్ 10లో



దివ్యాంగుల సమస్యల పరిష్కారం 8లో

న్యూస్‌రీల్

నేటి నుంచి చందనోత్సవ టికెట్ల విక్రయాలు

ఆన్‌లైన్‌లో రూ. 1500 టికెట్లు



సింహాచలం: ఈ నెల 10న జరిగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవానికి సంబంధించి దర్శన టికెట్ల విక్రయాలు శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి ప్రారంభించనున్నట్టు దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి వెల్లడించారు. ఈ నెల 7వతేదీ వరకు సాయంత్రం 5గంటల వరకు విక్రయాలు జరుగుతాయని పేర్కొన్నారు. సింహాచలం, మహారాణిపేట, అక్కయ్యపాలెంలోని యూనియన్ బ్యాంకు బ్రాంచ్‌లు, సింహాచలం, సాలిగ్రామపురం(అక్కయ్యపాలెం బ్రాంచ్), బిర్లా జంక్షన్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లతో పాటు సింహాచలం కొండపైన ఉన్న పీఆర్వో కార్యాలయంలో కూడా రూ.300, రూ.1000 టికెట్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

ఆన్‌లైన్‌లో కూడా విక్రయాలు

ఈనెల 3వతేదీ సాయంత్రం 4 గంటల నుంచి 7వతేదీ సాయంత్రం 6గంటల వరకు రూ.300, రూ.1000 టికెట్లతో పాటు రూ.1500 టికెట్లు కూడా ఆన్‌లైన్‌లో లభ్యమవుతాయని ఈవో పేర్కొన్నారు. www.ap temples.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా టికెట్లు పొందవచ్చని తెలిపారు. 10వ తేదీన చందనోత్సవం రోజు ఎలాంటి దర్శనం టికెట్లు విక్రయాలు జరగవని స్పష్టం చేశారు. టికెట్లు లేని భక్తులు ఉచిత దర్శనం క్యూలో మాత్రమే దర్శనానికి వెళ్లాల్సి ఉంటుందని సూచించారు.

రేపటి నుంచి తొలివిడత చందనం అరగదీత



చందనం చెక్కలను ముక్కలుగా కోస్తున్న దేవస్థానం సిబ్బంది

సింహాచలం: సింహగిరిపై శనివారం నుంచి తొలి విడత చందనం అరగదీత కార్యక్రమం నిర్వహించేందుకు దేవస్థానం వైదికులు, అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈ నెల 10న చందనోత్సవం సందర్భంగా స్వామి వారి నిజరూప దర్శనం అనంతరం తొలివిడతగా సమర్పించే మూడు మణుగుల చందనాన్ని (సుమారు 125 కిలోల పచ్చిచందనం) సమకూర్చేందుకు అరగదీత కార్యక్రమం చేపట్టనున్నారు. దీనిలో భాగంగా ఈ నెల 4న ఏకాదశిని పురస్కరించుకుని ఉదయం తొలిచందనం చెక్కకు శాస్త్రోక్తంగా పూజలు చేసిన అనంతరం, నాల్గో తరగతి సిబ్బంది చందనాన్ని అరగదీస్తారు. ఈ మేరకు గురువారం ఆలయ బేడామండపంలో చందనం చెక్కలను ముక్కలుగా కోసి అరగదీతకు అనుగుణంగా సిద్ధం చేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఏఈవో పాలూరి నరసింగరావు, సూపరింటెండెంట్ వెంకటరమణ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

శరవేగంగా బ్యాలెట్ పత్రాల ముద్రణ

శనివారం నాటికి విశాఖకు

మహారాణిపేట : ఎన్నికలకు సంబంధించి బ్యాలెట్ పత్రాల ముద్రణ శరవేగంగా జరుగుతోంది. జిల్లాలో ఆరు అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గానికి 45,350 బ్యాలెట్ పత్రాల ముద్రణ కర్నూలు జిల్లా ప్రభుత్వ ప్రింటింగ్ కార్యాలయంలో అవుతోంది. శనివారం నాటికి బ్యాలెట్ పత్రాలు విశాఖ చేరుకుంటాయి.

విశాఖ పార్లమెంట్ బరిలో 33 మంది..

విశాఖ పార్లమెంట్ స్థానానికి మొత్తం 33 మంది పోటీ పడుతున్నారు. వీరితో పాటు ఒక నోటా ఉంటుంది. ఆ ప్రకారం బ్యాలెట్ పత్రం నమూనాను తయారు చేశారు. ఒక ఈవీఎంలో 16 మంది, రెండో ఈవీఎంలో మరో 16 మంది, మరో ఈవీఎంలో ఇద్దరు ఉంటారు. మొత్తం మూడు ఈవీఎంలలో బ్యాలెట్ పత్రం లోడ్ చేస్తారు. మూడు ఈవీఎంలు కలిపి ఒక యూనిట్‌గా పరిగణిస్తారు. విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 1962 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఎస్.కోట అసెంబ్లీలో 270, విశాఖ తూర్పులో 293, దక్షిణలో 237, ఉత్తరలో 295, పశ్చిమలో 222, గాజువాకలో 306 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి.

ఐటీఐలో డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులు

కంచరపాలెం: లైట్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కంచరపాలెంలోని ప్రభుత్వ పాత పారిశ్రామిక శిక్షణ కేంద్రం (ఐటీఐ కళాశాల) ప్రిన్సిపాల్ జి.శ్రీకాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల వయసు 18 సంవత్సరాలు నిండి ఉండాలని, లైట్ వెహికల్ డ్రైవింగ్ లెర్నర్స్ లైసెన్స్ కలిగి ఉండాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 93735 57529, 91779 67397 నంబరులో సంప్రదించాలని సూచించారు.

బాబూ.. నీ నిర్వాకం చూడు

- 2014–19 మధ్య కాలంలో కష్టాలను మళ్లీ గుర్తుకు తెచ్చాడు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సామాజిక పింఛన్ లబ్ధిదారులు
- పింఛన్ తీసుకునేందుకు అష్టకష్టాలు పడుతున్న వృద్ధులు
- బ్యాంకుల వద్ద పడిగాపులు పడుతున్న అవ్వతాతలు
- కొన్ని చోట్ల సర్వర్లు మొరాయించడంతో అవస్థలు
- బ్యాంకు ఖాతాలు బ్లాక్‌లో ఉండటంతో చిక్కులు



శ్రీహరిపురం ఎస్‌బీఐ శాఖలో పింఛను లబ్ధిదారుల అవస్థలు



చిట్టివలస ఎస్‌బిఐ వద్ద రూ.20 ఇచ్చి విత్‌డ్రా స్లిప్పులు రాయించుకుంటున్న పింఛన్‌దారులు



విశాఖలోని ఓ బ్యాంకు వద్ద పింఛన్ కోసం క్యూలో పడిగాపులు

సాక్షి, విశాఖపట్నం: ఎన్నికల వేళ చంద్రబాబు నయవంచక కుట్రతో మళ్లీ పాత రోజులు పునరావృతమయ్యాయి. దీర్ఘకాలిక వ్యాధులు, కీళ్ల నొప్పులు వంటి ఆరోగ్య సమస్యలున్న వారు, ఏ పని చేసుకోలేక ఆసరా కోసం సమాజం వైపు ఆశగా ఎదురుచూసే పండుటాకులు మళ్లీ రోడ్డున పడ్డారు. ఎటు చూసినా కన్నీటి వేదనలే కనిపిస్తున్నాయి. ఏ బ్యాంకుకు వెళ్లి చూసినా అలసిన పండుటాకుల ఆవేదనే వినిపిస్తోంది. ఈ వయసులో తమను ఇబ్బంది పెట్టి ఏం సాధిస్తావంటూ చంద్రబాబును అవ్వాతాతలు దూషిస్తున్నారు.

తెలుగుదేశం పార్టీ హయాంలో రాబందుల్లా పీక్కుతినే జన్మభూమి కమిటీల దగ్గరకు వెళ్లి ప్రతి రోజూ క్యూలో నిలబడితే తప్ప పింఛన్ దక్కని దుస్థితి ఉండేది. పక్షం రోజులు దాటినా పింఛన్ అందక విలవిల్లాడే దయనీయ పరిస్థితి, కన్నీటి వేదనలు ఏ ప్రాంతంలో చూసినా సాక్షాత్కరించేవి. ఈ పరిస్థితిని మార్చమని అవ్వాతాతలు దేవుడిని ప్రతి రోజూ కోరుకునేవారు. కాలం మారింది.. పాలనా మారింది. అవ్వాతాతలకు అండగా నిలుస్తూ వారి మోముల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చిరునవ్వులు నింపింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థతో ఇంటి వద్దే పింఛన్ అందజేస్తూ.. వారికి కొండంత భరోసానిచ్చారు. అయితే ఎన్నికల వేళ చంద్రబాబు కుటిల రాజకీయాలతో వృద్ధులు మళ్లీ పడరాని పాట్లు పడుతున్నారు. వృద్ధులంతా పింఛన్ డబ్బుల కోసం ఒకేసారి బ్యాంకులకు రావడంతో చాలా చోట్ల సర్వర్లు పనిచేయకపోవడంతో సాయంత్రం వరకు పడిగాపులు కాశారు. మరోవైపు బ్యాంకు ఖాతాలు కొందరికి ఉన్నా.. అవి చాలా ఏళ్లుగా లావాదేవీలు జరపని కారణంగా ఫ్రీజ్ అయిపోయాయి. అందులో పింఛను డబ్బులు పడటంతో రెన్యువల్ కోసం చార్జీలు కట్ అవుతున్నాయి. దీంతో కొందరికి కేవలం రూ.100 నుంచి రూ.1000 లోపు మాత్రమే పింఛన్ అందుతోంది. ఇంకొన్ని చోట్ల పింఛన్‌దారులు దోపిడీకి గురవుతున్నారు. పింఛన్‌దారుల్లో ఎక్కువ మంది నిరక్షరాస్యులు కావడం వల్ల విత్‌డ్రా ఫారం నింపడానికి రూ.20 మొదలు తమ గ్రామం నుంచి ఆటో చార్జీలకు రూ.100 నుంచి రూ.200 వరకు అదనంగా చెల్లించుకోవాల్సి వస్తోంది. ఎక్కువ మంది వృద్ధులు ఎండ దెబ్బకు తాళలేక సొమ్మసిల్లిపోతున్నారు. ఈ వయసులో ఇలాంటి దుస్థితికి కారణమైన చంద్రబాబును ఎప్పటికీ క్షమించబోమంటూ లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఐదేళ్ల కిందట కష్టాలను మళ్లీ తెచ్చావంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు.

95.77 శాతం పింఛన్ల పంపిణీ

జిల్లాలో రెండు రోజుల సమయంలో బ్యాంకుల ద్వారా 95.77 శాతం, డోర్ టు డోర్ ద్వారా 95.21 శాతం పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం చిత్తశుద్ధితో పూర్తి చేసింది. బ్యాంకు ఖాతాలున్న 1,22,289 మంది పింఛనుదారులకు గానూ ఇప్పటి వరకూ 1,17,116 మంది ఖాతాల్లో సొమ్ము జమ చేశారు. 42,621 మందికి బ్యాంకు ఖాతాలు లేకపోవడంతో ఇంటికి వెళ్లి పంపిణీ చేయాల్సి ఉండగా.. ఇప్పటి వరకూ 40,595 మందికి అందించారు. చంద్రబాబు అండ్ కో ఎన్ని విధాలుగా పింఛన్ అందించకుండా కుయుక్తులు పన్నుతున్నా.. ప్రభుత్వం మాత్రం లబ్ధిదారులకు చేరవేసేందుకు శతవిధాలా ప్రయత్నిస్తోంది. అయినప్పటికీ.. మండుటెండలో బ్యాంకులకు వెళ్లలేక.. వెళ్లినా డబ్బులను ఖాతాల నుంచి తీసుకోలేక అవ్వాతాతలు నరకయాతన అనుభవిస్తున్నారు.

మా ఉసురు తగులుతుంది



వేసవిలో ఇంటి పట్టున ఉండే మాలాంటి వాళ్లను మండుటెండలోకి లాగడం బాధాకరం. ఈ రోజు బ్యాంక్‌కి వెళ్లాను. పెద్ద ఎత్తున క్యూ ఉండటంతో.. ఇంటికి వచ్చేశాను. రేపు వెళ్తాను. ఈ వయసులో మమ్మల్ని ఇబ్బంది పెట్టడం న్యాయమా చంద్రబాబూ? మేము ఇబ్బందులు పడుతుంటే.. నీకు రాజకీయాలు కావాలా? మా ఉసురు తగులుతుంది.

– ఎర్రా సీతమ్మ, పింఛన్ లబ్ధిదారు

ఎండలో వెళ్లలేకపోతున్నాం



ఇప్పుడు బయట ఎండలు నిప్పుల కొలిమిలా మండుతున్నాయి. ఇళ్లలోనే ఉండలేకపోతుంటే 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న భీమిలి ఎలా వెళ్లగలం. బ్యాంకు పుస్తకాలు కూడా చాలా వరకు పని చేయడం లేదు. ఎవరితో చెప్పుకోవాలి మా బాధ. చంద్రబాబు పీడ పూర్తిగా వదిలిపోవాలి.

– కంచర్ల అన్నపూర్ణ, తాటితూరు

నిమ్మగడ్డతో చంద్రబాబే చేయించాడు



గత నెలలో ఇచ్చినట్లు సచివాలయంలో పింఛను ఇస్తారనుకుని.. 7వ నంబర్ సచివాలయానికి వెళ్లాను. అక్కడ సిబ్బంది మీ పింఛన్ డబ్బులు బ్యాంక్ ఖాతాలో వేశారని చెప్పారు. నా వయసు 70 ఏళ్లు. ఇప్పుడు బ్యాంక్‌కు ఎవరిని తోడు తీసుకుని వెళ్లాలి. ప్రతి నెలా తెల్లవారేసరికి ఇంటికి తీసుకువచ్చి వలంటీర్ డబ్బులు ఇచ్చేవారు. ఎన్నికల వేళ చంద్రబాబు నిమ్మగడ్డతో ఫిర్యాదు చేయించి వలంటీర్ల ద్వారా పింఛన్ ఇవ్వండా ఆపించేశాడు. చంద్రబాబు వల్లే మాలాంటి ముసలివాళ్లకు ఈ పాట్లు వచ్చాయి. చంద్రబాబు, నిమ్మగడ్డకు కచ్చితంగా మా ఉసురు తగులుతుంది.

– చావాకుల సత్యం, ఆపరేషన్ కాలనీ, ఆరిలోవ

మా కష్టాలు తెలియవా చంద్రబాబు?



ఇంటి పట్టున ఉండే మాలాంటి వృద్ధుల పాలిట చంద్రబాబు శనిలా దాపురించాడు. ఏడు పదుల వయసు దాటిన ఆయనకు వృద్ధులు పడే కష్టాలు తెలియకపోవడం శోచనీయం. మేము పడుతున్న కష్టాలపై పవన్ కల్యాణ్ కనీసం స్పందించకుండా చంద్రబాబుకు వత్తాసు పలకడమేంటి? వృద్ధులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా జగన్‌బాబు చక్కగా చూసుకున్నారు. ఇంటికే వలంటీర్‌ను పంపి పింఛన్ అందజేశారు. మీ రాజకీయాల కోసం మమ్మల్ని ఇబ్బంది పెడతావా చంద్రబాబూ.?

– బాల మోహనరావు, అల్లిపురం

చంద్రబాబూ.. అనుభవిస్తావ్



పింఛనుదారుల కష్టాలు చూస్తే ఎవరైనా చలించిపోతారు. మానవత్వం లేని చంద్రబాబు వంటి వాళ్లే అవ్వాతాతలను కష్టాలకు గురి చేస్తున్నారు. అతనికి పెద్ద వయసు, అనుభవం ఉన్నా పెద్ద మనసు లేదు. అందుకే తరచూ వృద్ధులు, దివ్యాంగులను కష్టపెడుతున్నాడు. దీనికి ఫలితం అనుభవిస్తాడు.

– దొంతల శ్రీను, ఆనందపురం

ఏం సాధిస్తావ్.. బాబూ?



మందులు, కిరాణా ఇతర అవసరాల కోసం నెల రోజులుగా మాలాంటి నిరుపేదలు పింఛను కోసమే ఎదురు చూస్తుంటాం. ఒకటో తేదీ నాటికి మా నోటి కాడ అందే కూడును చంద్రబాబు మళ్లీ మళ్లీ లాగేస్తున్నాడు. జగన్ చేసిన మంచి పనులు చూసి ఓర్వలేకపోతున్నాడు. ఇలాంటి వారికి ఓటుతోనే బుద్ధి చెప్పాలి.

– రవ్వ అప్పల పైడమ్మ, తాటితూరు

అనుక్షణం.. అప్రమత్తం

- సమర్థంగా ఎన్నికల విధుల నిర్వహణ
- పోలింగ్ కేంద్రాల వద్ద వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

బీచ్ రోడ్డు: అధికారులు అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. ఆర్వో, ఏఆర్వో, సెక్టోరల్ అధికారులు, రూట్ అధికారులకు సిరిపురంలోని వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఈవీఎంల వినియోగం, ఇతర అంశాలపై గురువారం సాయంత్రం శిక్షణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎలాంటి క్లిష్ట పరిస్థితి ఎదురైనా ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలని హితవు పలికారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతుల కల్పనపై సంబంధిత ఆర్వోలు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని తప్పకుండా పాటించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో సెక్టోరల్ అధికారుల పాత్ర చాలా కీలకమన్నారు. ప్రతి అంశంపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకుని, పీవోలు, ఏపీవోలకు తెలియజేయాలన్నారు. జిల్లాలోని 1991 పోలింగ్ కేంద్రాల్లో ఇప్పటికే అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టామన్నారు. స్త్రీ, పురుషులు, వికలాంగులు, వృద్ధులకు ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎండ తగలకుండా షామియానాలు వేయాలని సూచించారు. తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. ఎన్‌సీసీ వలంటీర్ల ద్వారా ఓటర్లకు సహాయ, సహకారాలు అందించాలని చెప్పారు. నడవలేని స్థితిలో ఉన్న వారి కోసం ప్రత్యేకంగా వీల్ చైర్లు సమకూర్చామని, వాటిని ఆయా ఆర్వోలు పోలింగ్ కేంద్రాలకు చేర్చాలని సూచించారు. విద్యుత్ సంబంధిత పనులు ముందుగా చేయించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద మరుగుదొడ్లు ఉన్నాయో లేదో చూసుకోవాలని, ఒక వేళ లేకపోతే బయో టాయిలెట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ నెల 13న ఉదయం 5 గంటలకే మాక్ పోలింగ్ ప్రారంభం కావాలని, సంబంధిత సాంకేతిక ప్రక్రియను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈవీఎంలను తీసుకెళ్లే క్రమంలో ఎండలో ఎక్కువ సేపు ఉంచకుండా జాగ్రత్త వహించాలన్నారు. విశాఖ ఎంపీ స్థానానికి 33 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్న నేపథ్యంలో ప్రతి పోలింగ్ కేంద్రంలో ఆ మేరకు ఏర్పాట్లు చేయాలన్నారు. మూడు బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్ యూనిట్ ఉంచేందుకు అనువుగా 4 గీ2 అడుగుల సైజులో బల్లలను ఏర్పాటు చేయాలన్నారు. పీవోలు తప్పకుండా ఫోన్ ఆన్ చేసి ఉంచాలని, అందుబాటులో ఉండాలని చెప్పారు. పోలింగ్ ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సాగుతుందన్నారు. సాయంత్రం 6 గంటలకల్లా పోలింగ్ కేంద్రంలోకి వచ్చిన వారికి టోకెన్లు ఇచ్చి పోలింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అధికారులు, సిబ్బంది తప్పకుండా ఐడీ కార్డులు ధరించాలన్నారు. సోషల్ మీడియాలో ఏమైనా తప్పుడు అంశాలు సర్క్యులేట్ అయిన క్రమంలో సంబంధిత ఆర్వో తక్షణమే స్పందించి ఖండన చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని సూచించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఈవీఎంల వినియోగంపై డెమో నిర్వహించారు. ఈ సదస్సులో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, బెల్ అధికారి వినాయక, వివిధ నియోజకవర్గాల ఆర్వోలు, ఏఆర్వోలు, సెక్టోరల్ అధికారులు, రూట్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

భారీగా నకిలీ కరెన్సీ పట్టివేత

- భీమిలి క్రాస్ రోడ్డు వద్ద పట్టుకున్న పోలీసులు
- ఆరుగురి అరెస్ట్, ఒకరు పరారీ
- వివరాలు వెల్లడించిన ఏసీపీ సునీల్



వివరాలు తెలియజేస్తున్న ఏసీపీ సునీల్

తగరపువలస : ఆనందపురం మండలం భీమిలి క్రాస్‌రోడ్డు చెక్ పోస్టు వద్ద గురువారం సాయంత్రం సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆరుగురు వ్యక్తుల నుంచి భారీగా నకిలీ కరెన్సీతోపాటు గోల్డ్ కోటెడ్ బంగారు నాణేలు, బిస్కెట్లు, మారణాయుధాలు, ఒక కారు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మధురవాడ జోన్ ఏసీపీ సునీల్, ఆనందపురం సీఐ తిరుపతిరావు వివరాలు తెలిపారు. నకిలీ కరెన్సీ అక్రమంగా రవాణా చేస్తున్నారని తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తగరపువలస మీదుగా విశాఖ వెళ్తున్న ఒక కారు, రెండు ద్విచక్రవాహనాల కోసం క్రాస్‌రోడ్డు వద్ద కాపు కాశారు. వీరిని గమనించిన వాహనాల్లోని ఆరుగురు వ్యక్తులు... తమ వాహనాలను వెనక్కి తిప్పి పారిపోవాలని ప్రయత్నించగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. వీరిలో విజయనగరం ఆర్‌కే టౌన్‌షిప్‌కు చెందిన గొర్లె హేమచంద్రరావు, బాలాజీవీధికి చెందిన హరి శ్రీను, అయ్యన్నపేట కూడలికి చెందిన మంగలపుది సుబ్బారెడ్డి, దాసన్నపేటకు చెందిన దనాల శ్రీనివాస్, గుంకలాంకు చెందిన కునుకు హేమంత్‌కుమార్, పలాసకు చెందిన జన్ను సునీల్ పట్టుబడ్డారు. సోమేష్ అనే వ్యక్తి పారిపోయాడు. వీరి నుంచి రూ.10 లక్షల విలువ చేసే రూ.500 నకిలీ నోట్ల కట్టలు వంద, నకిలీ గోల్డ్ బిస్కెట్లు 24, నకిలీ గోల్డ్ కాయిన్లు 92, మొబైల్ ఫోన్లు 23, ల్యాప్‌టాప్ 1, సిమ్‌కార్డులు 7, పోలీస్ జంగిల్ యూనిఫారాలు, నకిలీ నోట్ల బండిల్స్, వాటి తయారీకి వినియోగించే రసాయనాలు, వస్తువులు, రైస్ పుల్లింగ్ బౌల్ స్వాధీనం చేసుకున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలన్న దురాశతో ప్రధాన నిందితుడు గొర్లె హేమంత్ కుమార్ మిగిలిన వారిని కలుపుకుని నకిలీ కరెన్సీతోపాటు రైస్ పుల్లింగ్ చేయాలనుకున్నాడు. వీరంతా విజయనగరంలో కలుసుకుని అమెజాన్ ద్వారా చిల్డ్రన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, హైదరాబాద్ కరెన్సీతోపాటు నకిలీ గోల్డ్ కాయిన్లు, బిస్కెట్లు కొనుగోలు చేశారు. అలాగే ఇత్తడి షాపులో రైస్ పుల్లింగ్ పాత్ర కొనుగోలు చేసి విశాఖలో ఉన్న సోమేష్ అనే వ్యక్తికి ఇవ్వడానికి వెళ్తూ పట్టుబడ్డారు. వీరి దగ్గర నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులను సీజ్ చేసి అరెస్ట్ చేశారు.

హోం ఓటింగ్ నిర్వహణకు పటిష్ట చర్యలు

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున



హోం ఓటింగ్‌పై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, చిత్రంలో ఏడీసీ విశ్వనాథన్

మహారాణిపేట: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు జిల్లాలో 85 ఏళ్లు దాటిన వయోవృద్ధులు, 40 శాతం పైబడి అంగవైకల్యం ఉన్న వారికి ఈ నెల ఈ నెల 7, 8వ తేదీల్లో పటిష్టంగా హోం ఓటింగ్ నిర్వహిస్తామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. హోం ఓటింగ్ విధి, విధానాలపై అవగాహన కల్పించే నిమిత్తం గురువారం కలెక్టరేట్ వీసీ హాలులో ఏడీసీ కె.ఎస్. విశ్వనాథన్‌తో కలిసి ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అభ్యర్థులకు హోం ఓటింగ్ నిర్వహణ ప్రక్రియ గురించి అవగాహన కల్పించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. ఫారం –12డీ ద్వారా ఇప్పటికే బీఎల్వోలకు దరఖాస్తు అందజేసిన ఓటర్లకు ఈ నెల 7, 8వ తేదీల్లో ఇంటి వద్దే ఓటింగ్ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. ఒక వేళ ఆ రెండు తేదీల్లో ఎవరైనా మిగిలిపోతే మే 9న మరోసారి అవకాశం కల్పిస్తామన్నారు. అప్పటికీ ఓటు హక్కు వినియోగించుకోకపోతే తమ హక్కును కోల్పోయినట్లేనని స్పష్టం చేశారు. జిల్లాలో 1,404 మంది హోం ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్నారని, వీరందరూ ఓటు వేసేలా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. పీవో, ఇద్దరు సహాయకులు, వీడియోగ్రాఫర్, ఎస్కార్టు, పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో రహస్య పద్ధతిలో ఓటింగ్ ఉంటుందని వివరించారు. ఏడీసీ కె.ఎస్.విశ్వనాథన్ హోం ఓటింగ్ విధి, విధానాలు, సాంకేతిక అంశాలపై అభ్యర్థులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో పలువురు అభ్యర్థులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సేవలు

బీచ్ రోడ్డు: ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ సేవలను రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయాలకు చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేసుకునే వెసులుబాటు కల్పించిందని ఏయూ ఎంప్లాయిమెంట్ డిప్యూటీ చీఫ్ దొరబాబు ఒక ప్రకటనలో తెలిపారు. http:// employment. ap. gov. in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ సేవలు పొందవచ్చునని ఆయన పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీ గాజువాక మేనిఫెస్టో ఆవిష్కరణ

- అన్నివర్గాల ఆకాంక్షలకు ప్రతిరూపం ఇది
- స్వచ్ఛ గాజువాకకు ప్రాధాన్యం
- యువత భవితకు విజయవారధి
- ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, ఫ్లైఓవర్ వంతెనలు నిర్మాణానికి చర్యలు
- స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకం



గాజువాక అసెంబ్లీ మేనిఫెస్టోలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అక్కిరెడ్డిపాలెం/గాజువాక : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గాజువాక వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ స్థానిక మేనిఫెస్టోను ప్రకటించారు. నియోజకవర్గంలో వివిధ వర్గాలకు చెందిన ప్రజల నుంచి అందిన సూచనల ప్రకారం గాజువాకలో ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఈ మేనిఫెస్టోను రూపొందించినట్టు గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అమర్‌నాథ్ పేర్కొన్నారు. తాను పుట్టి పెరిగిన గాజువాకను జాతీయ స్థాయిలో, అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని కంకణం కట్టుకుని మేనిఫెస్టోను తయారు చేసినట్టు చెప్పారు. స్థానిక కార్యాలయంలో మేనిఫెస్టోను పవర్ పాయింట్ ద్వారా వివరించారు. ఉగాది నుంచి గాజువాక అభివృద్ధిపై పలువురు సలహాలు సూచనలను తీసుకొని మేనిఫెస్టోను రూపొందించామన్నారు. మహిళలు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, మహిళా ఉద్యోగినులు, కాంట్రాక్ట్ కార్మికులు, వ్యాపారులతో పాటు వివిధ వర్గాలతో మాట్లాడి వారి ఆలోచనలు, సలహాలను పరిగణలోకి తీసుకున్నట్లు తెలిపారు. తాను ఎమ్మెల్యేగా విజయం సాధించిన మరుక్షణం నుంచి మేనిఫెస్టోను అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తి రెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, మాజీ మేయర్ పులుసు జనార్దనరావు, కార్పొరేటర్లు భూపతిరాజు సుజాత, రాజాన రామారావు, ఉరుకూటి రామచంద్రరావు, ఇమ్రాన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎన్నికల అదనపు పరిశీలకుడు తిప్పల దేవన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఉరుకూటి అప్పారావు, రొంగలి జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోలో ముఖ్యమైన అంశాలు

• పాతగాజువాక నుంచి శ్రీనగర్ వరకు ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం • అగనంపూడి టోల్‌గేటు తరలింపు కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధం • గాజువాకలో మెట్రో రైలు కార్యరూపం దాల్చేందుకు కృషి • మల్టీ లెవల్ కార్ పార్కింగ్ ఏర్పాటు • మార్కెట్ల ఆధునికీకరణ • భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ పూర్తి చేస్తాం • గెడ్డలన్నింటికీ రిటైనింగ్ వాల్స్ నిర్మాణం • గంగవరం పోర్టు కాలుష్యంపై టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయడంతోపాటు యుద్ధప్రాతిపదికపై కాలుష్య నివారణ చర్యలు • జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో అగ్రస్థానంలో నిలిచేలా సౌకర్యాలు • ఏటా గాజువాక ఉత్సవం నిర్వహణ • సీసీ కెమెరాల ఏర్పాటు • పర్యాటక ప్రాంతంగా యారాడ అభివృద్ధి • తక్కువ కాలుష్యంతో కూడిన కంపెనీల ఏర్పాటు • ఒకేషనల్, డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీల ఏర్పాటు • పోటీ పరీక్షల విద్యార్థులకు కోచింగ్ సెంటర్లు, డిజిటల్ లైబ్రరీల ఏర్పాటు • విజయవారధి పేరుతో యువత భవిష్యత్తుకు బంగారు బాట. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లతో అనుసంధానం • వ్యాపారం చేయడానికి ఆసక్తి కనబర్చే యువతకు చేయూత • పారిశుధ్య నిర్వహణ, వీధి దీపాలు, రోడ్ల అభివృద్ధికి ప్రణాళిక • కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం • ప్రజలు తమ సమస్యలను చెప్పుకోవడానికి టోల్‌ఫ్రీ నంబర్, యాప్, వెబ్‌సైట్ ఏర్పాటు

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకమని మోదీతో చెప్పించాలి : రాష్ట్రానికి వస్తున్న ప్రధాని మోదీతో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చంద్రబాబు ప్రకటన చేయించగలరా అని అమర్‌నాథ్ ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్‌ను అమ్మకానికి పెట్టిన బీజేపీతో టీడీపీ, జనసేన అంటకాగుతూ ఇక్కడి ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వైఎస్సార్‌సీపీ మొదటి నుంచీ వ్యతిరేకమని స్పష్టం చేశారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు అలుపెరగని పోరాటం చేస్తానన్నారు.

కొట్లాట కేసులో పది మందికి రిమాండ్

తగరపువలస : భీమిలి మండలం గొల్లల తాళ్లవలసలో బుధవారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన కొట్లాటకు సంబంధించి 10 మందిని భీమిలి పోలీసులు గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జనసేన నాయకులను టీడీటీ నాయకులు ప్రచార రథం పైనుంచి కిందకు లాగేసిన సంఘటన బుధవారం సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారమైంది. దీనిపై స్థానిక పంచాయతీలో ఇరువర్గాల మధ్య వాట్సాప్‌లో పరస్పర దూషణలు జరిగాయి. దీంతో టీడీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యుడు కోరాడ రమణ తన అనుచరులతో వైఎస్సార్‌సీపీకి చెందిన అక్కరమాని అప్పలనాయుడు ఇంటిపైకి మారణాయుధాలతో వెళ్లి దాడి చేశారు. దీనిని ఎదుర్కొనే ప్రయత్నంలో ఇరువర్గాలకు చెందిన ముగ్గురు గాయపడ్డారు. మధురవాడ జోన్ ఏసీపీ సునీల్, భీమిలి సీఐ డి.రమేష్, తదితరులు బుధవారం రాత్రి నుంచే గ్రామంలో పోలీసులతో పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. ఈ మేరకు విచారణ అనంతరం కోరాడ రమణతోపాటు అతని వర్గీయులు నలుగురు, అక్కరమాని అప్పలనాయుడుతోపాటు అతని వర్గీయులు నలుగురిని కలిపి మొత్తం 10 మందిని రిమాండ్‌కు తరలించారు.

ప్రచార పర్వం



76వ వార్డులో దివ్యాంగుడితో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ - పెదగంట్యాడ



మధురవాడ వుడా కాలనీలో మిషన్ తొక్కుతున్న వైఎస్సార్‌సీపీ భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు -మధురవాడ



52వ వార్డు కరాసా రహదారి పక్కన దోస వేస్తున్న వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆనంద్‌కుమార్ - విశాఖ విద్య



29వ వార్డులో వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న వైఎస్సార్ సీపీ దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ - డాబాగార్డెన్స్



43వ వార్డులో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుకు హారతి ఇస్తున్న మహిళ - సీతంపేట



10వ వార్డులో పండ్ల విక్రయించే మహిళ, ఆమె పిల్లల యోగక్షేమాలు తెలుసుకుంటున్న వైఎస్సార్ సీపీ విశాఖ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ - ఆరిలోవ



చినముషిడివాడలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ పెందుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

విశాఖ సిటీ: దివ్యాంగుల ఫిర్యాదులపై దృష్టి పెట్టి తక్షణమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ పోలీస్ అధికారులను ఆదేశించారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి గురువారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక స్పందనలో భాగంగా దివ్యాంగ సురక్ష టోల్‌ఫ్రీ నంబర్‌కు 8 మంది కాలర్స్ ఫోన్ చేశారు. సైన్ లాంగ్వేజ్ తెలిసిన నిపుణురాలిని అందుబాటులో ఉంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఇందులో ఇతర రాష్ట్రం నుంచి ఒకరు, ఇతర జిల్లాల నుంచి ముగ్గురు, విశాఖ నుంచి నలుగురు ఇలా ఒక అంధుడు, ఏడుగురు దివ్యాంగులు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఫిర్యాదులలో భర్త వేధింపులు, అద్దె ఇల్లు ఖాళీ చేసే విషయంపై, అసంపూర్తి ఇల్లు నిర్మాణం, తండ్రీ కొడుకుల మధ్య విభేదం, ఉన్నతాధికారి వేధింపులు, తల్లిదండ్రులు స్కూలుకు పంపకుండా ఇంట్లో వేధించడం వంటి ఫిర్యాదులు వచ్చాయి. వీటిపై తక్షణమే సంబంధిత ప్రాంతాల అధికారులకు ఈ సమస్యలను రాతపూర్వకంగా పోస్టల్, వాట్సప్ ద్వారా అందజేసి, సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని దిశా దివ్యాంగ సురక్ష కంట్రోల్, ఇతర సిబ్బందిని పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా నియమించిన ఇన్‌స్పెక్టర్‌ను సీపీ ఆదేశించారు.

నాడు కూల్చేసి.. నేడు నిర్మిస్తారా..?

- టీడీపీ ప్రభుత్వంలో ఇళ్లు కూల్చివేత
- గెలిపిస్తే మళ్లీ నిర్మిస్తానంటూ గంటా హామీ
- మేము నమ్మం అంటూ మత్స్యకారుల ఆగ్రహం



గంటా శ్రీనివాసరావును ప్రశ్నిస్తున్న మత్స్యకారులు

కొమ్మాది : అధికారం కోసం ఎలాంటి హామీలైనా ఇచ్చేందుకు, ఎన్ని అబద్ధాలైనా ఆడేందుకు టీడీపీ నాయకులు వెనుకాడడం లేదు. టీడీపీ ప్రభుత్వంలో గంటా శ్రీనివాసరావు మంత్రిగా వున్నప్పుడు జీవీఎంసీ 4వ వార్డు చేపల తిమ్మాపురంలో మత్స్యకారులు 75 ఇళ్లు నిర్మించుకున్నారు. ఆ సమయంలో వాటిని నిర్దాక్షిణ్యంగా గంటా శ్రీనివాసరావు కూల్చివేయించి పాపం మూటకట్టుకున్నారు. మళ్లీ ఇప్పుడు ఎన్నికలు రావడంతో రాజకీయ లబ్ధి కోసం మరలా అదే ప్రాంతానికి గురువారం ఓట్లు వేయమని అడిగేందుకు వచ్చిన గంటా... ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రతి ఒక్కరికీ ఇళ్లు నిర్మించి ఇస్తానని చెప్పుకొచ్చాడు. నాడు మత్స్యకారులు నిర్మించుకున్న 75 ఇళ్లను తొలగించినపుడు కానరాని తమరు... ప్రస్తుతం ఎలా ఇళ్లు నిర్మిస్తారంటూ మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఓ వ్యక్తి లబ్ధి కోసమే ప్రచారం

ఈ ప్రాంతంలో ఉన్న ఓ వ్యక్తి ఇక్కడి మత్స్యకారులకు తన బలం చూపించుకోవడం కోసమే గంటా శ్రీనివాసరావును ప్రచారానికి తీసుకొచ్చాడని పలువురు అంటున్నారు. నాడు అన్యాయం చేసి, నేడు న్యాయం చేస్తామంటే ఎలా నమ్ముతామని మత్స్యకారులు అంటున్నారు. నాడు అధికార అహంకారంతో 75 కుటుంబాలను రోడ్డును పడేసిన గంటా శ్రీనివాసరావు... నేడు ఓట్ల కోసం ఏ ముఖం పెట్టుకుని వచ్చారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు గంటా చేసిన మోసం.., తాము పడ్డ కష్టాలు, కోర్టు కేసులు, మానసిక క్షోభ ఎలా మర్చిపోతామని ఇక్కడి మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దమ్ముంటే తాను గెలిచిన తర్వాత ఇక్కడ ఇళ్లు నిర్మిస్తామని లిఖిత పూర్వకంగా రాసివ్వగలరా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో ఓటు ద్వారా గంటాకు తగిన బుద్ధి చెబుతామని మత్స్యకారులు పేర్కొన్నారు.

ఆర్యవైశ్యులకు సముచిత స్థానం



మాట్లాడుతున్న తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ, చిత్రంలో ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఆర్యవైశ్యుల ప్రతినిధులు



హాజరైన నగరానికి చెందిన ఆర్యవైశ్య ప్రతినిధులు

- ఆత్మీయ సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స, తూర్పు అభ్యర్థి ఎంవీవీ

ఎంవీపీకాలనీ: ఆర్యవైశ్య సామాజిక వర్గ ప్రతినిధులతో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని గాదిరాజు ప్యాలస్‌లో ఈ సమావేశం జరగ్గా వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి బొత్స ఝాన్సీ, విశాఖ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొత్స ఝాన్సీ, ఎంవీవీలు మాట్లాడుతూ కులమతాలు అతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అన్ని సామాజికవర్గాలకు మేలు చేశారన్నారు. సామాజిక న్యాయంలో ప్రాధాన్యత కల్పించారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలవాలని ఆర్యవైశ్యులను కోరారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఆర్యవైశ్యులకు సముచిత స్థానం కలిపిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు శివ గణేష్, సత్యవరపు సతీష్, ఆర్యవైశ్య సంఘం కమిటీ సభ్యులు సతీష్, రామ్‌గోపాల్, ప్రియ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

గీతం విద్యార్థుల ఆందోళన



గీతం క్యాంపస్‌లో ఆందోళనకు దిగిన విద్యార్థులు

కొమ్మాది: రుషికొండలో గల గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు గురువారం ఆందోళనకు దిగారు. బీటెక్, డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు అందరూ 40 శాతం అదనంగా ఫీజు చెల్లించాలని యాజమాన్యం తెలపడంతో ఒక్కసారిగా ఆందోళనకు దిగారు. ఇక్కడ వాస్తవానికి బీటెక్, డిగ్రీలో నిర్వహించే సెమ్‌లలో 40 శాతం మార్కులు వస్తే ఉత్తీర్ణత సాధించినట్లు నిర్ధారిస్తారు. అయితే ఉత్తీర్ణత సాధించిన వారు మరో 40 శాతం అదనంగా ఫీజు కట్టాలని, కొత్తగా ఓ వెబ్‌సైట్ తీసుకొచ్చామని, దాని నిమిత్తం ఈ అధిక మొత్తాన్ని చెల్లించాలని యాజమాన్యం డిమాండ్ చేసినట్లు విద్యార్థులు తెలిపారు. ఫీజులు పూర్తిగా చెల్లించి మరలా 40 శాతం అదనంగా ఫీజు చెల్లించాలంటే ఎంతవరకు సమంజసమంటూ యాజమాన్యాన్ని విద్యార్థులు నిలదీశారు. విద్యార్థుల జీవితాలతో గీతం యాజమాన్యం ఆటలాడుకుంటోందని, ఇదంతా ఎన్నికల ఫండ్స్ కోసం అదనంగా ఫీజు చెల్లించాలంటున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఈ నిర్ణయాన్ని యాజమాన్యం వెనక్కి తీసుకోకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

భువనేశ్వర్–ఎల్‌టీటీ మధ్య సమ్మర్ స్పెషల్స్



తాటిచెట్లపాలెం: వేసవి సీజన్‌లో ప్రయాణికుల రద్దీని తగ్గించడానికి ఈస్ట్ కోస్ట్ రైల్వే పలు ప్రత్యేక రైళ్లు నడిపేందుకు సిద్ధమైందని వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సమ్మర్ స్పెషల్ రైళ్ల వివరాలిలా..

- భువనేశ్వర్–లోకమాన్య తిలక్ టెర్మినస్(ఎల్‌టీటీ)(08420) రైలు ప్రతి బుధవారం రాత్రి 11 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి మరుసటి రోజు తెల్లవారు 6.45కు దువ్వాడ చేరుకుని, తిరిగి 6.50కు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.30 గంటలకు లోకమాన్య తిలక్ టెర్మినస్‌కు చేరుకుంటుంది. ఈ రైలు జూన్ 26 వరకు నడుస్తుంది.
- తిరుగు ప్రయాణంలో లోకమాన్య తిలక్ టెర్మినస్–భువనేశ్వర్ (08419) రైలు ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటలకు లోకమాన్య తిలక్ టెర్మినస్‌లో బయలుదేరి మరుసటిరోజు సాయంత్రం 5.45లకు దువ్వాడ చేరుకుని, తిరిగి 5.50కు బయలుదేరి అదే రోజు మధ్యరాత్రి(ఆదివారం తెల్లవారు) 1.45 గంటలకు భువనేశ్వర్ చేరుకుంటుంది. ఈ రైలు జూన్ 28 వరకు నడుస్తుంది.

విశాఖ–హతియా స్పెషల్ రైళ్ల రద్దు

విశాఖపట్నం–హతియా– విశాఖపట్నం(08559/08560) మధ్య నడుస్తున్న వీక్లీ సమ్మర్ స్పెషల్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు సీనియర్ డీసీఎం కె.సందీప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైళ్లను ఇటీవలే వేశారు. జూన్ నెలాఖరు వరకు రాకపోకలు సాగించాలి. ఈ రైలుకు సరైన ఆక్యుపెన్సీ, డిమాండ్ లేనందున రద్దు చేస్తున్నట్లు తెలిసింది. వాస్తవానికి ఈ రైలుకు సరైన సమయంలో వేస్తే డిమాండ్ ఉంటుంది. అనువు కాని వేళల్లో ఈ ట్రిన్ నడుస్తున్నందున ఖాళీగా రాకపోకలు సాగించింది. బొకారో, టాటా ఎక్స్‌ప్రెస్‌ల వేళలకు కొంచెం అటూ ఇటుగా ఈ రైలు విశాఖ నుంచి బయలుదేరేలా చేస్తే డిమాండ్ ఉంటుందని పలువురు రైల్ యూజర్లు కోరుతున్నారు.

అభివృద్ధికి సహకరించండి

- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

పెందుర్తి: సమగ్రాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కోరారు. పెందుర్తి సమీపంలోని చీమలాపల్లి వద్ద ఓ కన్వెన్షన్‌లో గురువారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని వ్యవసాయ, రవాణా రంగాన్ని బీజేపీ ప్రభుత్వం ముందంజలో ఉంచిందన్నారు. పోలవరం ప్రాజెక్ట్ కోసం చంద్రబాబు హయాంలోనే ఎక్కువ నిధులు కేటాయించామని గడ్కరీ చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌కు నీటి కొరత తీరాలంటే పోలవరం ప్రాజెక్ట్ పూర్తి కావాలన్నారు. అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్, పెందుర్తి జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు పలు అంశాలపై గడ్కరీకి వినతిపత్రం అందించారు. మాజీ ఎమ్మెల్సీ మాధవ్, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, ఇతర బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో వ్యయ నియంత్రణ ప్రాజెక్టులు భేష్



ప్రారంభ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ భట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో లీడర్‌షిప్ సపోర్ట్ అండ్ ఎంకరేజ్‌మెంట్ ప్రొఫెషనల్ యుటిలిటీ (పల్స్) విధానం ద్వారా చేపడుతున్న వ్యయ నియంత్రణ ప్రాజెక్టుల పనితీరు ప్రశంసనీయమని స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ కొనియాడారు. స్టీల్‌ప్లాంట్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ విభాగం ఆధ్వర్యంలో ఎల్‌డీసీ విభాగంలో 'పల్స్'పై గురువారం నిర్వహించిన ఒకరోజు ఇంటరాక్షన్, శిక్షణ ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొని, సభ్యులతో ముచ్చటించారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్‌కు చెందిన 55 మంది యువ ఇంజినీర్లు, వివిధ నిపుణులతో కూడిన 15 బృందాల సభ్యులు పాల్గొన్నారు. ఎల్‌ఎంఎంఏ విభాగంలో పల్స్ కింద చేపట్టిన కార్యక్రమం విజయవంతం అయింది. ప్రారంభ కార్యక్రమంలో డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి. పాండే, స్వతంత్ర డైరెక్టర్లు ఎస్.కె. హిరాణి, ఘన శ్యామ్‌సింగ్‌తో పాటు సీజీఎంలు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

'స్పెషల్' దాడులు

- సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్, ఎస్‌ఈబీ విస్తృతంగా తనిఖీలు
- ప్రభుత్వ వైన్‌షాపుల్లోనే కాకుండా బార్లలో నిరంతరం సోదాలు
- అనధికార మద్యం, సారా నిల్వలు, రవాణాపై ఫోకస్
- 429 కేసుల నమోదు..381 మంది అరెస్ట్
- రూ.13.34 లక్షలు విలువ చేసే నాటుసారా, అనధికార మద్యం స్వాధీనం
- ఫిర్యాదుల సేకరణకు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు



స్వాధీనం చేస్తున్న మద్యం బాటిళ్లు

విశాఖ సిటీ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్, ఎస్‌ఈబీ అధికారులు వరుస దాడులతో దడ పుట్టిస్తున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లోనే కాకుండా బార్లలో వరుస తనిఖీలు నిర్వహిస్తున్నారు. మరోవైపు అనధికార మద్యం అమ్మకాలు, సారా నిల్వలు, రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు విస్తృతంగా సోదాలు చేపడుతున్నారు. అనధికార మద్యం విక్రయాలు, నిల్వలు చేస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన నాటి నుంచి జిల్లాలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో శాఖ పరిధిలో మహారాణిపేట, సీతమ్మధార, గోపాలపట్నం, పెందుర్తి, భీమిలిలలో అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. అనధికార మద్యం, సుంకం చెల్లించని మద్యంతో పాటు అక్రమంగా మద్యం రవాణా, నిల్వలపై ప్రత్యేక నిఘా పెట్టారు.

విస్తృతంగా తనిఖీలు

ప్రభుత్వ మద్యం దుకాణాల్లోనే కాకుండా, బార్ అండ్ రెస్టారెంట్లలో ఉల్లంఘనలపై దృష్టి సారించారు. జిల్లాలో ఇద్దరు సీఐలు, ఆరుగురు ఎస్‌ఐలు, 24 మంది ఎక్సైజ్ సిబ్బందితో దాడులు చేశారు. అలాగే డిప్యూటీ కమిషనర్ ఆధ్వర్యంలో బృందం 81, జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ఎ.మల్లికార్జున నియమించిన జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ కూడా 37 ప్రాంతాల్లో ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్లలో తనిఖీలు నిర్వహించింది. ఇందులో సమయపాలన పాటించని మూడు బార్లపై కేసులు నమోదు చేశారు. రెండు మద్యం దుకాణాల్లో అక్రమాలు గుర్తించిన అధికారులు.. సిబ్బందిని విధుల నుంచి తొలగించారు. అలాగే ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన ఒక మద్యం దుకాణం సేల్స్‌మన్‌ను విధుల నుంచి తప్పించారు.

భారీగా కేసుల నమోదు

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి ఎక్సైజ్, ఎస్‌ఈబీ అధికారులు నిర్వహించిన దాడుల్లో అనేక మందిపై కేసులు నమోదు చేశారు. అనధికార, సుంకం చెల్లించని మద్యంతో పాటు నాటు సారా ముఠాలపై చర్యలు తీసుకున్నారు. ఇప్పటివరకు 429 మంది కేసులు నమోదు చేసి 381 మంది నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి అనధికార మద్యం రవాణాకు వినియోగించిన రూ.3.73 లక్షలు విలువ చేసే 7 వాహనాలను సీజ్ చేశారు. అలాగే రూ.13.34 లక్షలు విలువ గల 170 లీటర్ల నాటుసారా, 77.83 లీటర్ల సుంకం చెల్లించని మద్యం, 3031 లీటర్ల అనధికార మద్యంను స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో అనధికార మద్యం, అధిక మొత్తంలో మద్యం నిల్వలు, ఫిర్యాదుల కోసం ఎస్‌ఈబీ, ఎక్సైజ్ శాఖలలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. ఎవరికైనా వీటిపై సమాచారం తెలిసిన పక్షంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో శాఖ కంట్రోల్ రూమ్ సబ్ ఇన్‌స్పెక్టర్ జి.వి.రమణ 9440902211, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కంట్రోల్ రూమ్ సబ్ ఇన్‌స్పెక్టర్ బి.వెంకటరాజు 9849316751 నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

రూ.7.50 లక్షల స్వాధీనం

పరవాడ: మండలంలోని వెన్నలపాలెంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో కలపాక గ్రామానికి చెందిన జగలింకి అచ్చన్న ద్విచక్ర వాహనంపై రూ.7.50 లక్షలును తీసుకువెళుతుండగా పోలీసులకు పట్టుబడ్డాడు. నగదుకు సంబంధించిన పూర్తి వివరాలు లేనందుకు సీజ్ చేసి అచ్చన్నను అదుపులో తీసుకున్నట్టు ఎస్‌ఐ టి.మల్లేశ్వరరావు చెప్పారు. నగదును ఆర్వోకు అందజేయనున్నట్టు సీఐ ఎస్.బాలసూర్యారావు చెప్పారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.72,270
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.66,250
వెండి(కిలో):	రూ.87,000

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.143
స్కిన్	: రూ.256
స్కిన్‌లెస్	: రూ.266